క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి నడుం బిగించండి

సంతనూతలపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలంతా ఆయా కేంద్రాల బలోపేతానికి నడుం బిగించాలని ఐసీడీఎస్ సంతనూతలపాడు సూపర్‌వైజర్ పి.నాగలక్ష్మి కోరారు. సంతనూతలపాడు మండలంలోని గుడిపాడు సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. పోషణ పక్వాడ్‌పై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణులలో రక్తహీనత నివారణకు తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు గల ఆహార పదార్థాలు తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలపై వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. గుడిపాడు సచివాలయ కార్యదర్శి ఆర్.జ్యోతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సచివాలయం, వైద్యారోగ్య శాఖ ప్రతినిధులు సుమతి, రూపవతి, శృతి లేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కళ్యాణి

ఒంగోలు సిటీ: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు డీఎస్‌జీడీసీ, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్తంగా శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ కళ్యాణి, జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏవీ రాజ్యలక్ష్మి, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భరద్వాజ, డీఎస్‌డీవో జె.రవితేజ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ షేక్ బాషా సమన్వయంతో నిర్వహించగా, ఒంగోలు ఎన్ఆర్సీ పరిధిలోని ఎనిమిది కళాశాలల నుంచి 300 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. జీజే సొల్యూషన్స్, వైఎస్ కేన్ఫోటెక్, ప్రీమియర్ సోలార్, కళ్లం టెక్స్‌టైల్స్, ఫ్యూచర్ ఐటీ సొల్యూషన్స్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ తదితర కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలలో 92.45 మంది ఉద్యోగ అర్హత పొందారని ప్రిన్సిపాల్ కళ్యాణి తెలిపారు. డీఎస్ కళాశాల నుంచి 129 మంది విద్యార్థులు పాల్గొనగా, 119 మంది ఉద్యోగాలు సాధించారని చెప్పారు.

ఘనంగా రైతు సంఘ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు, అమ్మనబ్రోలు, చదలవాడ, కండ్లగుంట, తదితర గ్రామాల్లో 89వ రైతు సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘ మండల నాయకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ రైతులు పంటలకు ధరలు నిర్ణయించుకోలేక ప్రభుత్వాలపై, దళారులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన దిగుబడి లేక, అరకొరగా వచ్చిన పంటకు సరైన ధర లేక రైతులు ఎన్నో కష్టాలు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు, పాలపర్తి యోనా, దాసరి ఆంజనేయులు, కాకాని సుబ్బారావు, యు.వెంకటేశ్వర్లు, మాదాసు నాగేశ్వరరావు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పథకం ద్వారా ప్రజలకు మేలు చేయాలి


ఆడిట్ నిర్వహిస్తున్న డ్వామా పీడీ జోసఫ్ కుమార్

మద్దిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు మేలు చేయాలని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశువులకు నీటి తొట్లు ఏర్పాటు చేయడానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక తనిఖీలో భాగంగా 19 గ్రామ పంచాయతీల పరిధిలో 2023–24 సంవత్సరంలో జరిగిన పనులను సీఆర్పీలు తనిఖీ చేశారు. ఈ క్రమంలో మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో మస్టర్ల దిద్దుబాటు జరిగినట్లు నిర్ధారించి రూ.34,645 రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని వారికి వెయ్యి రూపాయల చొప్పున రూ.7 వేల పెనాల్టీ విధించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి వండర్ మాన్, ఎంపీడీవో డీవీఎస్ ప్రసాద్, ఏపీఓ ధనంజయ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సంతనూతలపాడులో పూలేకి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


ఒంగోలులో పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు


నాగులుప్పలపాడులో పూలేకి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

మహనీయుల బాటలో నడవాలి

- ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు
- ఘనంగా పూలే, అంబేడ్కర్ జయంతి వేడుకలు

ఒంగోలు సిటీ: ఆనాటి రోజుల్లో వేళ్లూనుకుని ఉన్న సామాజిక రుగ్మత, అంటరానితనం, నిరక్షరాస్యత నిర్మూలన, తదితర సామాజికపరమైన అంశాలను రూపుమాపేందుకు అహర్నిశలూ కృషిచేసిన మహనీయులంతా భారతావని గర్వించదగిన మహాపురుషులని, నేటి యువత ఆ మహనీయుల బాటలో నడవాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఏకేయూ సమావేశపు హాలులో వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతీరావుపూలే, అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్‌రావు అధ్యక్షత వహించగా, ముందుగా పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ హరిబాబు మాట్లాడుతూ నిరక్షరాస్యత అధికంగా ఉన్న ఆనాటి రోజుల్లో కుల వ్యవస్థ, వర్ణ వ్యవస్థ, సాంఘిక దురాచారాలు వంటి వాటిని నిర్మూలించేందుకు ప్రజలను జాగృతం చేసి పోరాడిన మహనీయులు పూలే, అంబేడ్కర్ అని కొనియాడారు. సామాజిక న్యాయం, సమ సమానత్వం కోసం తీవ్రంగా శ్రమించారన్నారు. ఆ ఇద్దరు మహనీయుల ఆశయాలు నేటి ఆధునిక సమాజంలో ప్రతిఒక్కరికీ కాంతి రేఖలుగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.నిర్మలామణి, డీన్ ప్రొఫెసర్ సోమశేఖర, సీఈ డాక్టర్ కేవీఎన్ రాజు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతీరావుపూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు విద్యుత్ సౌధ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్చంద్ర, రాష్ట్ర నాయకులు పొరాబత్తిన జాలరామయ్య, జిల్లా నాయకులు కర్ర దేవసహాయం, కొండమూరి కొండలరాయుడు, పల్లె కృష్ణమూర్తి, నూకతోటి కుమార్ స్వామి, పి.తిరుపతిస్వామి, బొంత కళ్యాణ్, నన్నేసాని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో కుల రక్కసి కోటలు బద్దలుకొడదాం...

ఒంగోలు టౌన్: సామాజిక విప్లవకారుడు జ్యోతీరావు పూలే స్ఫూర్తితో కులరక్కసి కోటలను బద్దలు కొట్టేందుకు ప్రతిఒక్కరూ సిద్ధం కావాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పూలే జయంతిని పురస్కరించుకుని స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో తోటా తిరుపతిరావు, వేసపోగు మోజేష్, నారాయణ, కిలారి పెద్దబ్బాయి, టంగుటూరి రాము, రాచకొండ కృష్ణయ్య, మల్లికార్జున, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలులో పూలేకు పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న బీటీఏ నాయకులు

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు: బీసీ సెల్ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు గుంజి ఏడుకొండలు ఆధ్వర్యంలో పూలేకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ బి.వెంకటరెడ్డి, యువజన విభాగం నాయకుడు పాకనాటి మహానందరెడ్డి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


చీమకుర్తిలో పూలేకి నివాళులర్పిస్తున్న కేఎన్‌పీఎస్, ఇతర సంఘాల నాయకులు

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: పూలే జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి దంపతులు పాల్గొని పూలమాలలతో నివాళులర్పించారు. ఉప్పుగుండూరులో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులతో కలిసి పూలే విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో దక్షణామూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు పోలినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ పాద పవన్, సర్పంచ్ అశోక్, గండు వెంకట్రావు, బాలకృష్ణ, శివ, అత్తంటి యేసు, వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి కిరణ్, పెంట్యాల శ్రీను, పక్కెల వజ్రంబాబు తదితరులు పాల్గొన్నారు

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని పూలే విగ్రహానికి వైఎస్సార్ సీపీ, కేఎన్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు దుడ్డు వెంకట్రావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, జంగాల కోటి, బీసీ సంఘ రాష్ట్ర నాయకులు బత్తుల మల్లికార్జున, షేక్ ఖాదర్‌బాషా, పేరం శ్రీనివాసరావు, వేమా చినకోటేశ్వరరావు, తెల్లమేకల గాంధీ, డీ పుల్లయ్య, చల్లా శ్రీనివాసరావు, దొంతు వెంకట్రావు, యు.నారాయణ, ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ సంఘాల నాయకులు బొంతా ఏసుదాస్, జే యాకోబు, జడ విజయకుమార్, కర్నా ప్రసాద్, బిరుదుల లింగయ్య స్థానికులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మన్నం శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా జ్యోతీరావుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీఎస్ వెంకట్రావు, పాఠశాల సెక్రటరీ హరిబాబు, శ్రీనివాసరావు, మధు, పీడీ సాయికిషోర్, శరత్, అరుణ్ కుమారి, రజిని, కాజమ్మ, ఉమామహేశ్వరి, పద్మశ్రీ, పీడీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహాలకు మంత్రుల నివాళులు

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక కొత్తకూరగాయల మార్కెట్ సమీపంలో, అన్నవరప్పాడు 4వ లైన్ వద్ద ఉన్న పూలే విగ్రహాలకు మంత్రులు సత్యకుమార్ యాదవ్, బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ, నగర మేయర్ గంగాడ సుజాత, డీఆర్‌ఓ చినఓబులేసు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, బీసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


ఉప్పుగుండూరులో నివాళులర్పిస్తున్న పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు


చీమకుర్తి : ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో..


చీమకుర్తి : బీసీ సంఘాలు, ఉద్యోగుల ఆధ్వర్యంలో..


కొత్తపట్నంలో జ్యోతీరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు

సంక్షిప్తంగా

దొంగిలించిన వస్తువులు తిరిగి అప్పగింత

నాగులుప్పలపాడు: మండలంలోని చదలవాడ రఘునాయకస్వామి ఆలయంలో 2024 జనవరి నెలలో జరిగిన దొంగతనం కేసులో అపహరణకు గురైన వస్తువులు రికవరీ చేసి శుక్రవారం ఆలయ అధికారులకు అందజేసినట్లు ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు తెలిపారు. అప్పటి దొంగతనం కేసులో స్వామివారి 5 కిలోల వెండి ముద్ద, 400 గ్రాముల వెండిపల్లెం, సీతమ్మ వారి రెండు మంగళ సూత్రాలు దొంగతనానికి గురవడంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఆ వస్తువులను రికవరీ చేశారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆలయ ఈవో అనిల్‌కు శుక్రవారం ఆ వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కులగణన అమలు చేయాలని ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బీసీలు

ఒంగోలు వన్‌టౌన్: బీసీ కులగణన అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీల ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. బీసీ నాయకులు ధరణికోట లక్ష్మీనారాయణ, బొట్ల సుబ్బారావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఓపీడీఆర్ నాయకుడు చావలి సుధాకర్‌రావు, ఐఎల్‌పీ నాయకుడు దాసరి సుందరరావు, బీసీ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గుంటూరు మస్తాన్‌రావు, పెద్దన్న, కుట్టుబోయిన కోటి యాదవ్, కాకుమాను రవిచంద్ర, టి.శివప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

121 మంది క్విస్ విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రిమ్స్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, క్విస్ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 121 మంది క్విస్ విద్యార్థులు, ఫ్యాకల్టీ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. విద్యార్థులను క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి అభినందించారు. క్విస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు, హెచ్‌వోడీ డాక్టర్ జి.శ్రీనివాసరావు, కల్చరల్స్, ఎన్ఎస్ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, స్టూడెంట్ అసోసియేట్ డీన్ డాక్టర్ వాసుబాబు పర్యవేక్షించగా, ఒంగోలు రిమ్స్‌కు చెందిన డాక్టర్ మానసేశ్, సుధ, మోహన్‌రెడ్డి, సుధీర్ బాబు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి హరిహరక్షేత్రంలో ఘనంగా వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్, కుటుంబ సభ్యులు

చీమకుర్తి: చీమకుర్తి హరిహరక్షేత్రంలో 19వ వార్షికోత్సవాన్ని ఆలయ ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్, శిద్దా సుధాకర్, బాలాజీతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలలో చీమకుర్తి పట్టణంతో పాటు చుట్టుపక్కల నుంచి అనేక మంది భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

గిరిజనకాలనీ రోడ్డు పరిశీలన


రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొత్తపట్నం: మండల సర్వసభ్య సమావేశంలో ఈ నెల 9వ తేదీ రోడ్లపై చర్చ జరిగిన నేపథ్యంలో మండలంలోని ఈతముక్కల ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల రవీంద్రరెడ్డి జలజీవన్ మిషన్ ద్వారా వేసిన పైపులైన్, రోడ్లపై ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు.. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.రామ్మోహన్, ఏఈ వంశీకృష్ణారెడ్డి శుక్రవారం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పైపులైన్ వేసిన కొన్నిచోట్ల పూడ్చకపోవడంతో ప్రజల ఇబ్బందిని గుర్తించారు. వెంటనే మరమ్మతులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఈతముక్కల సర్పంచ్ మేడికొండ సునీత, ఎంపీటీసీ సభ్యురాలి భర్త బందారు సుబ్బారావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పఠాన్ నజీర్, యూత్ అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, తుమ్మా పుల్లయ్య, నరసారెడ్డి, అద్దూరి పుల్లమ్మ, కత్తి శ్రీను, సింగోతు మల్లికార్జున్‌రావు, తుళ్లూరి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా భాస్కరరావు


బొడ్డు భాస్కరరావు

ఒంగోలు: ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా బొడ్డు భాస్కరరావు ఎన్నికయ్యారు. ఆరుగురు సీనియర్ అభ్యర్థులు బరిలోకి దిగడంతో ఎన్నికల్లో ఉత్కంఠ నెలకొంది. శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 817 మందికిగానూ 694 మంది ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. దాదాపు 85 శాతం ఓట్లు పోలవడంతో గెలుపు అవకాశాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రాత్రి 9.20 గంటలకు ఎన్నికల అధికారి పీఎస్వీ గుప్తా అధికారికంగా ఎన్నికల ఫలితాలు వెల్లడించారు. అనంతరం ఎన్నికల ప్రక్రియలో పాలుపంచుకున్న మిగిలిన ఎన్నికల అధికారులతో కలిసి విజేతలకు డిక్లరేషన్ ఫాం అందించారు. బొడ్డు భాస్కరరావు ఘన విజయాన్ని సొంతం చేసుకుని 5వ దఫా అధ్యక్ష స్థానాన్ని అధిరోహించనున్నారు.

అపెక్స్ హైస్కూల్లో అవార్డుల ప్రదానోత్సవం



అవార్డులు అందుకున్న విద్యార్థులతో అపెక్స్ హైస్కూల్ కరస్పాండెంట్ శివకోటిరెడ్డి

ఒంగోలు సిటీ: స్థానిక అపెక్స్ హైస్కూల్లో 2024–25 సంవత్సరం అవార్డుల ప్రదానోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అపెక్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.శివకోటిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఐఐటీ ఫౌండేషన్, మెమరీ ట్రైనింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, హ్యాండ్ రైటింగ్, అబాకస్, రీజనింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏసీఈ చైర్మన్ అనిల్, ఆకృతి అకాడమీ చైర్మన్ రాము, ఐఐటీ ప్రోగ్రాం చైర్మన్ చెంచిరెడ్డి, ప్రిన్సిపాళ్లు జ్యోతి, లక్ష్మి, అనూరాధ, శ్రీలక్ష్మి, అపెక్స్ హైస్కూల్ ఏవో ఎస్‌కే బాషా, సోషల్ మీడియా అడ్మిన్ కే శివారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రీసర్వేపై దరఖాస్తులకు ఆహ్వానం

సంతనూతలపాడు: రీ సర్వేకు సంబంధించి రైతుల నుంచి అభ్యంతరాలుంటే దరఖాస్తులు అందజేయాలని సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి కోరారు. సంతనూతలపాడు మండలం వేములపాడు సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పొలాల రీ సర్వే పూర్తి చేశామని, పొలాల విస్తీర్ణాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉందని అన్నారు. దీనిపై రైతులకు 19 నోటీసులు అందజేశామన్నారు. రీ సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరిగినా రైతుల అభ్యంతరాలను దరఖాస్తుల ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు. పొలం విస్తీర్ణం, రెవెన్యూ రికార్డులు ఒకేలా ఉండేందుకు అభ్యంతరాలపై గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ప్రవీణ్, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పెన్ కాక్ సిలాట్ పురుషుల జట్టుకు అభినందనలు

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ తరఫున నార్త్ బెంగళూరు యూనివర్సిటీలో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పెన్ కాక్ సిలాట్ పోటీల్లో పాల్గొనే పురుషుల జట్టును యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం అభినందించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ హరిబాబు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ సోమశేఖర, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకుడు అడపాల వెంకటేశ్వర్లు తదితరులు అభినందనలు తెలిపారు.

హాస్టళ్లలో అంబేడ్కర్ జయంతి నిర్వహించాలి

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకుల హాస్టళ్లలో ఈ నెల 14వ తేదీ అంబేడ్కర్ జయంతి నిర్వహించాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా హాస్టళ్ల పరిధిలోని మండల స్పెషలాఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రజా పరిషత్ అధికారులు, మండల తహసీల్దార్లు, స్థానిక ప్రజాప్రతినిధులను హాస్టల్ అధికారులు ఆహ్వానించాలన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కొత్తపట్నం: పేదలు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని, ఇళ్ల స్థలం లేని వారికి ఇళ్ల పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా నాయకురాలు కె.రమాదేవి డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు పెండింగులో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఆటో కార్మికులకు స్టాండ్ ఏర్పాటు చేయాలని, అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు. పట్టపు ప్రకాశం అధ్యక్షత వహించగా, రమాదేవి మాట్లాడుతూ మండలంలో పేదలు సాగుచేసుకుంటున్న భూములకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అర్హులైన పేదలకు మిగులు భూములు పంపిణీ చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ పి.మధుసూదనరావుకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం పార్టీ మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి, నాయకులు పి.కృష్ణ, కే శ్రీను, పి.జయబాబు, జి.జాను, సుబ్బులు, సులోచన తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డ్రోన్ వర్క్ షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాల, ఎన్ఐటీ రూర్కెలా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐదు రోజుల బూట్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వారి సౌజన్యంతో నిర్వహించిన డ్రోన్ టెక్నాలజీ వర్క్ షాప్‌లో దాదాపు 120 మంది విద్యార్థులు పాల్గొని వివిధ అంశాల గురించి తెలుసుకున్నారు. వారు నేర్చుకున్న దానిని టెక్నికల్ పేపర్ల రూపంలో ప్రదర్శించి వారి ఆలోచనలు పంచుకున్నారు. కళాశాలలోని రామానుజన్ సెమినార్ హాలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు, డీపీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.వి.సుబ్బారావు, ఎన్ఐటీ రూర్కెలా ప్రొఫెసర్ డాక్టర్ బాలాజీ, సీఎస్ సీడీఈ డీన్, డీపీఎస్ఆర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ భార్గవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు ఇది అద్భుతమైన అవకాశమన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఎన్నో నేర్చుకున్నారని, విద్యార్థులు స్టార్టప్ ఐడియాలతో ముందుకు రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం వర్క్ షాప్‌లో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులకు అద్భుతమైన వర్క్ షాప్‌లు నిర్వహించేందుకు సహకరించిన క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అసెంబ్లీ, పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు జరగాలి

ఒంగోలు సబర్బన్: రాష్ట్రాల అసెంబ్లీలతో పాటు పార్లమెంటుకూ ఒకేసారి ఎన్నికలు జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ అన్నారు. ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో వన్ నేషన్ - వన్ ఎలక్షన్ కార్యక్రమంలో శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒకే దేశం - ఒకే ఎన్నిక అనేది ఈనాటిది కాదన్నారు. స్వాతంత్య్రం వచ్చాక చాలా ఏళ్లపాటు దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరిగాయని గుర్తు చేశారు. ఆ తర్వాత రాజకీయ అస్థిరతవల్ల దేశంలో ఎక్కడో ఒకచోట ఏవో ఎన్నికలు జరుగుతూనే వచ్చే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ఒకేసారి ఎన్నికలు జరిగితే వాటి ప్రయోజనాలు, పరిణామాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. దీని ప్రభావం దేశాభివృద్ధిపై పడిందని అన్నారు. ఈ క్రమంలోనే మళ్లీ ఒకే దేశం–ఒకే ఎన్నికపై నలభై ఏళ్ల కిందటే చర్చ మొదలైందని వెల్లడించారు. సమావేశంలో ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేయాలి...

హెచ్‌ఐవీ ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో, వ్యాధిని నివారించడంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సత్యకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై మంత్రి వివరాలడిగి తెలుసుకున్నారు.

నీడనిచ్చే మొక్కలు నాటాలి


సామాజిక తనిఖీ వివరాలను పరిశీలిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్

నాగులుప్పలపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎక్కువ శాతం పండ్లమొక్కలు ఉన్నాయని, వాటి స్థానంలో నీడనిచ్చే మొక్కలు నాటాలని ఎస్ఆర్‌పీ రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించగా, డ్వామా పీడీ జోసఫ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. విజిలెన్స్ అధికారి ఒండర్ మ్యాన్, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఏపీఓ రవిబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.